# ముందుచూపు

## వడ్డాది శాంతి

''జానకీ! అలా నేను రామమందిరం వరకు వెళ్ళివస్తాను.'' అని ఆయన అనగానే ''సరే వెళ్ళిరండి'' అన్నాను. ఆయన అలా బయటకి వెళ్ళగానే నెమ్మదిగా కుర్చీలో నుండి లేచి చదువుతున్న రామాయణ గ్రంధాన్ని టేబుల్‌మీద పెట్టి లేచి వంటగది వైపు వెళ్ళాలి అనుకున్న నాకు, ప్రక్కంటిలో నుండి ఏదో పెద్దగా గొడవ వినబడటంతో, పెరటివైపు వెళ్ళాను.

అనసూయమ్మగారి గొంతు పెద్దగా వినబడుతోంది. ఆవిడ కోడలును కాబోలు అంటున్నాది–

''ఏం మాయదారి ప్రపంచమే తల్లీ! ఏనాడైనా ఇలాంటి విడ్డూరాలు విన్నామా! మీకు, నేను.. ఆయన బరువైపోయాము. ఇంట్లో చాకిరీకి నన్ను.. బయట చాకిరీకి ఆయన పనికివస్తున్నాం కాబట్టి మమ్ములను ఈ ఇంట్లో ఉండనిచ్చారు. లేకపోతే మమ్ములను ఏనాడో ఈ ఇంట్లోంచి పంపేసేవాళ్ళు'' అంటూ ఆవిడ పెద్దగా అరుస్తున్నాది.

దానికి తగినట్టుగా ఆవిడ కోడలు ఆవిడను ఎదిరిస్తూ అత్తగారికి ఎదురు జవాబు ఇస్తున్నాది.

''మీకు అంత కష్టంగా వుంటే వెళ్ళిపోండి. మీరిన్ని కష్టాలుపడుతూ ఇక్కడ వుండటమెందుకు? మమ్ములను సాధించడమెందుకు? అయినా మనింటికి మనం పని చేసుకోవడం తప్పా?'' అంటూ ఆమె అడిగేసరికి ఆవిడ ఉక్రోషంగా–

''కాదే తల్లీ.. ఏమాత్రం కాదు. మరి నా కొడుకు నాకు మందులు తేవడం తప్పా? నీ నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నావ్'' అంటూ అనసూయమ్మ ఆవేశంగా అరచింది.

ఆ ఇంట్లో ప్రతీరోజు జరుగుతున్న భాగోతమే అది. ఓ గంటసేపు ఆ అత్తా.. కోడళ్ళు ఇష్టం వచ్చినట్టు అరచుకుంటారు. మళ్ళా మామూలే.

నేను, అనసూయమ్మ ఒకే వయసువాళ్ళం. నాకూ ఇద్దరు కొడుకులే. ఆవిడకు అంతే. మా ఆయన ముందాలోచనవల్ల నేడు మేము ఇంతహాయిగా, ప్రశాంతంగా ఉండగల్గుతున్నాం.

ఆనాడు ఆయన తీసుకొన్న నిర్ణయానికి బాధపడ్డా నేడు ఎంతో హాయిగా, సంతోషంగా ఉంటున్నాం. ఆయన కనుక అలాచేసి వుండకపోతే నేడు మా ఇంట్లో కూడా ఇలాంటి గొడవలే వచ్చేవి. ఆర్థికంగా కొడుకులపై ఎప్పుడూ ఆధారపడకూడదన్నది ఆయన సదుద్దేశం. మాకు ఇద్దరు కొడుకులు. ఇద్దరికీ చదువులు చెప్పించారు. ఇద్దరికీ మంచి ఉద్యోగాలు వచ్చేలా చేసారు. నిజానికి మా వారిది ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. వచ్చినదానితో గుట్టుగా సంసారాన్ని నెట్టుకొచ్చి పిల్లలను పెంచి పెద్దవాళ్ళని చేసి, ప్రయోజకులుగా తీర్చిదిద్దాం. అది మా బాధ్యత. అలాగే అన్ని బాధ్యతలను సక్రమంగా నిర్వహించాం.

ఆరోజు మా పెద్దవాడికి పిల్లని చూడటానికి వెళ్ళాము.

అబ్బాయికి.. అమ్మాయి.. అమ్మాయికి.. అబ్బాయి ఒకరినొకరు నచ్చడం జరిగింది. మావారు ముందుగా ఆడపిల్ల తండ్రిని అడిగారు–

''చూడండి చలపతిరావుగారూ! అమ్మాయికి మీరు ఏమాత్రం ఇద్దామనుకుంటున్నారు?'' అని.

దానికి ఆ పెద్దాయన–

''రాఘవరావుగారు! ముందుగా మీరు ఎంత కావాలనుకుంటున్నారో చెప్పండి?'' అని ఆ పెద్దాయన ఎదురడగగానే మా ఆయన,

''అదంతా ఏంకాదు చలపతిరావుగారు, ముందుగా మీ అభిప్రాయం చెప్పండి'' అని మా ఆయన అనగానే.

''సరే మీ మాటకి విలువ ఇచ్చి, నేను చెబుతాను. అమ్మాయికి ఓ రెండు లక్షలు ఇవ్వాలని అనుకుంటున్నాం. ఇక లాంఛనాలు.. వగైరా అన్నీ మీరు కోరినట్టుగా నెరవేరుస్తాం.'' అని మావారి వంక చూసారు ఆయన.

అందుకు మావారు, ''చాలా సంతోషం చలపతిరావుగారు. మీ మాటకి నేను ఎటువంటి అభ్యంతరం చెప్పను. కాని నావి కొన్ని షరతులు.'' అని మావారు అనగానే పెళ్ళికూతురు తండ్రి ముఖంలో కాస్తంత ఆందోళన కనిపించడం నేను గమనించాను. అతను నుదుటన పట్టిన చెమటను రుమాలుతో తుడుచుకుంటూ, ''ఏమిటో చెప్పండి'' అని అన్నారు ఆ పెద్దాయన.

విషయం మాకు కూడా తెలియకపోవడంతో మేము ఆశ్చర్యంగా ఉన్నాము ఆ షరతులు ఏమిటా అని. మావారు చెప్పడం మొదలుపెట్టారు.

''మీరు మాకు ఇస్తామన్న రెండులక్షలు నా పేరున బ్యాంకులో వేస్తేచాలు. మాకు మీరు ఎటువంటి లాంఛనాలు చెల్లించనవసరంలేదు. మా పెళ్ళిబట్టలు మా డబ్బుతో మేము కొనుక్కుంటాం. మీరు మీ అమ్మాయి కావలసిన బట్టలతో సహా మీరు కొనుక్కోండి. పెళ్ళిని చాలా సింపుల్‌గా రిజిస్ట్రాఫీసులో చేయాలి. పెళ్ళికి మీరు అనగా మీ కుటుంబ సభ్యులు, మేము అనగా మా కుటుంబ సభ్యులు పెళ్ళి జరిగాక, మనమంతా కలసి ఓ మంచి హోటల్‌కి వెళ్ళి చక్కటి భోజనం చేస్తాం. మా అబ్బాయికి మీరు ఏమీ పెట్టవద్దు. మీ అమ్మాయికి మేము ఎటువంటి ఆభరణాలు పెట్టం.'' ఇవి నా షరతులు. ఇప్పుడు చెప్పండి మీరేమంటారో?'' అని మావారు అనగానే ఆ పెద్దాయనతో పాటు అందరం గట్టిగా ఊపిరి పీల్చుకున్నాం. ఎందుకంటే షరతులంటే.. ఎలాంటివో అనుకున్నాం. కాని అవి ఇంత స్వల్పంగా ఉంటాయనుకోలేదు ఎవరం. మావారి మాటలన్నీ విన్న తరువాత మా వియ్యంకుడుగారు అన్నారు–

''బావగారు! అంత బాగానే వుందిగాని పెళ్ళికి ఎవరినీ పిలవకపోతే బాగోదు కదా! నలుగురూ.. నాలుగు రకాలుగా అనుకుంటారు.'' అని సందేహంగా మావారివంక చూసారు వియ్యంకుడు.

ఆయన మాటలకి మావారు చిరునవ్వు నవ్వుతూ–

''బావగారు! మనం ఇలా ఆలోచిస్తూపోతాంకనుకే మనం ముందుకు సాగలేకపోతున్నాం. ఎవరండీ ఆ నలుగురు? మీదగ్గరుంటే మీ మాట. నా దగ్గరుంటే నా మాట ఆడేవాళ్ళేనా? పెళ్ళికి పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు, వాళ్ళను కన్నవాళ్ళం అంటే మనం ముఖ్యం. ఎందుకండీ ఈ ఆర్భాటాలు, అలసటలూ.. సరే మీకంతగా కావాలనుకుంటే పెళ్ళి జరిగాక మీకు నచ్చిన రీతిలో మీ వాళ్ళందరికీ విందు ఏర్పాటు చేసుకోండి. దానికి నాకు ఎటువంటి అభ్యంతరంలేదు. మిగతా షరతులలో ఎటువంటి మార్పులేదు.. రాదు కూడ.'' అని మావారు అన్నారు.

అన్నీ విన్న నా మనసులో ఆశ్చర్యం. నాతో ఒక్కమాట కూడా చెప్పకుండా ఇన్ని నిర్ణయాలు ఈయన ఎప్పుడు తీసుకున్నారో నాకు అర్థంకాలేదు. నా అనుమానాలన్నిటినీ మనసులోనే దాచుకొన్నాను. ఇంటికి వెళ్ళాక మాట్లాడుకోవచ్చునని ఊరుకున్నాను.

ఆడపెళ్ళివారు మావారి షరతులన్నింటికీ అంగీకరించారు. త్వరలో ముహూర్తాలు పెట్టుకుందామని చెప్పి వారివద్ద సెలవు తీసుకొని మేము ఇంటికి చేరుకున్నాము.

పనులన్నింటినీ ముగించుకొని పడకగదిలోకి వెళ్ళాను. అలవాటు ప్రకారం ఆయనకు కాళ్ళు

నొక్కుతూ అడిగాను-

''ఏమండీ! మీరు ఆడపెళ్ళివారి దగ్గర మాట్లాడిన మాటలు నాకేమీ అర్థంకాలేదు. అసలు ఉద్దేశ్యం ఏమిటీ? పెళ్ళి సింపుల్‌గా చేస్తే మన బంధువర్గం మాత్రం ఊరుకుంటారా?''

అందుకాయన మంచంమీద నుండి లేచి కూర్చొని-

''ఇలా నేను ఎందుకు చేస్తున్నానో చెబుతాను విను. కాలం మారుతోంది. కాలంతోపాటు మనం కూడ మారాలి. ఇంకా పాత చింతకాయ పచ్చడులే తింటాం అంటే ఎలా? జీవితంలో ప్రతిమనిషికీ ముందాలోచన అంటూ ఒకటుండాలి. ఇంతవరకూ నువ్వు, నేనూ. మన పిల్లలు మనలో ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా జీవిస్తున్నాం. కాని రేపు వాళ్ళకి పెళ్ళాలు వస్తారు. ఆ వచ్చినవాళ్ళ మనస్తత్వాలు ఎలా ఉంటాయో? మనం ఊహించలేం. ఇప్పుడు అన్నింటికీ మా అమ్మా.. నాన్న అంటున్న మన పిల్లలలో తప్పకుండా మార్పు వస్తుంది. ఎందుకంటే ఎంతవారలైన 'కాంతదాసులే' కదా. అది సహజం. పెళ్ళాం చేతులలో వాళ్ళు కీలుబొమ్మలుగా మారిపోవచ్చు. మనలను పట్టించుకోకపోవచ్చు. వాళ్ళ పిల్లలు, వాళ్ళ సంసారం. అప్పుడు ఆర్థిక బలం కూడా సన్నగిల్లిన మనం మనోవేదనకు గురి అవుతాం. మనపై ఖర్చు పెట్టడానికి వాళ్ళు వెనుకడుగు వేయడం మొదలుపెడతారు. అందుకే అప్పుడు గొడవలు పడకుండా వుండటానికే ఈ ముందాలోచన.

ఆడపెళ్ళివారు ఇచ్చే కట్నం.. కానుకలతో అందరికీ బట్టలుగట్రా పెట్టి ఆర్భాటంగా పెళ్ళి చేసేసి అందరి మెప్పులూ పొందాలనుకోవడం అవివేకం. అందరూ వస్తారు. తినేసి, ఏ ప్లాస్టిక్‌వో, స్టీలువో బహుమతులు ఇచ్చేసి, చేతులు దులుపుకుపోతారు. దీనివలన ఏం ప్రయోజనం. అటు ఆడపెళ్ళివారికి ఖర్చు. వధూవరులకు అలసట. ఇలాంటివాటిని కొన్నాళ్ళైన, కొంతమందైనా 'బేన్' చేయాలి జానకి. నా సంపాదన అంతంత మాత్రం. నాకేమి పించన్‌రాదు. మునుముందు మనం ప్రతీదానికీ వాళ్ళపైన ఆధారపడాలంటే చాలా.. చాలా గొడవలు. అందుకే మనకున్న ఇద్దరి కొడుకులకు కట్నం తీసుకుంటాను. అలా అని ఆడపిల్లగలవాళ్ళను పీడించను. వాళ్ళు ఎంత ఇవ్వగలిగితే అంతే. మన పిల్లలు ఉన్న ఈ ఉద్యోగాలకు తగినట్టుగా ఒక్కొక్కరికీ రెండేసి లక్షలకు తక్కువ ఎవ్వరూ ఇవ్వకుండా ఉండరు. మొత్తం నాలుగు లక్షలు మన ఇద్దరి పేరా జాయింట్ ఎకౌంట్ వేసేస్తాను. నాకు ఒంట్లో ఓపిక ఉన్నన్నాళ్ళూ ఈ ఉద్యోగం చేస్తాను. నా జీతం + ఈ నాలుగు లక్షలపై వచ్చే వడ్డీతో మనిద్దరి జీవితాలు గడిచిపోతాయి. వాళ్ళకు పెళ్ళిళ్ళు కాగానే వేరు కాపురాలు పెట్టిస్తాను.

నేను వెంటనే ఆవేశంగా, ''ఏమండీ! ఆమాట మాత్రం అనకండి.'' అన్నాను.

''నీకు తెలీదు జానకి, కోడలిని నువ్వు కూతురులా చూసుకోవచ్చు. కాని ఆమె నిన్ను అమ్మలా చూడవచ్చు, చూడకపోవచ్చు. పాతికేళ్ళు పెరిగిన నీ కొడుకే మారినప్పుడు, పరాయి ఇంటి నుండి వచ్చిన నీ కోడలు నీమాటకి విలువ ఇస్తుందని ఆశపడటం పేరాశే అవుతుంది. తరుచు మీ అత్తా.. కోడళ్ళ మధ్య గొడవలు వస్తే.. వాటిని సరిదిద్దలేక మా తండ్రీకొడుకుల మధ్య మనస్పర్థలు.

వద్దు.. జానకి ఇవేమీ మనకొద్దు. దగ్గరగా వుండి నిత్యం దెబ్బలాడుకొనేకన్న దూరంగా వుండి అభిమానాలు పెంచుకుందాం. మన పిల్లలకు బాధ్యతలు తెలిసి రావాలంటే వాళ్ళను కొన్నాళ్ళు ఫ్రీగా వదిలివెయ్యాలి. ఎన్నాళ్ళు నీరెక్కల క్రింద దాచగలవు చెప్పు? అయినా వాళ్ళను ఎంతోదూరం పంపివేయనులే. మనకు దగ్గరలోనే ఇల్లుతీసి వుంచుతాను. తల్లిప్రేమ నాకు తెలియదా!

రేపు వచ్చే కోడళ్ళు, నువ్వు అత్తాకోడళ్ళు కాకుండా, ఫ్రెండ్స్‌లా ఉండాలి. ఆమెకు అవసరం అయితే నువ్వు సాయంచేయి. నీకు అవసరం అన్పిస్తే ఆమెకు చెయ్యాలనిపిస్తే సాయం చేస్తుంది. లేకపోతే ఆపై ఆ భగవంతుడు ఉన్నాడు. మన తదనంతరం ఆ బ్యాంకులో వేసిన సొమ్ముని ఇద్దరి కొడుకుల పిల్లలకు రాసేద్దాం. ఇవన్నీ నేను మన పిల్లలతో మాట్లాడాను. అందుకు ముందు వాళ్ళు చాలా బాధపడ్డారు. నేను వాళ్ళతో ఓ స్నేహితుడిలా మాట్లాడి ఒప్పించాను. ఇక నువ్వూ నా ప్రపోజల్‌కి ఒప్పుకోక తప్పదు.



ఆయన మాటలకి మౌనంగా వుండిపోయాను.

నా మౌనాన్ని అంగీకారంగా భావించి శుభకార్యాలు జరిపించారు. ఇప్పటికి మా పిల్లలకు పెళ్ళిళ్ళు జరిగి ఆరు సంవత్సరాలు అయింది. ప్రతీ ఆదివారం మా ఇంట్లో పండుగే. మనస్సు విప్పి అందరం మాట్లాడుకుంటాం. మిగతా రోజులలో ఎవరి దారులు వారివి. ఆర్థికంగా మాకెటువంటి లోటులేదు. కావలసినంత మనస్సశాంతి. మావారి ముందాలోచనలో ఎంతటి పరమార్థముందో, నేటి జరుగుతున్న ఇంటింటి రామాయణాన్ని చూస్తే నాకు బాగా అర్థమైంది.

'ఆయనొచ్చే వేళ అయింది' అనుకుంటూ వంటగదివైపు నడిచాను.

★